## డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలు



2



2

## ఉత్సాహంగా బాలల దినోత్సవం..

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

**అక్షరటుడే, ఇందూరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని శంకర్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'జాతీయ సమగ్రత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్బాయి లింబాద్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వాధ్యక్షుడు చింతల గంగాదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయన్న, ఉపాధ్యాయులు రాములు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





## నీల కంఠేశ్వరాలయంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పూజలు

**అక్షరటుడే, ఇందూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శుక్రవారం నీలకంఠేశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో సుదర్శన్ రెడ్డితో ప్రత్యేకంగా అభిషేకం, అర్చన చేయించారు. శాఖ జిల్లా సహాయ కమిషనర్ విజయ రామారావు స్వామివారి శేషవస్త్రంతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహాధికారి శ్రీరాం రవీందర్, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సిరిగిరి తిరుపతి, డైరెక్టర్ డాక్టర్ మదన్ మోహన్, ఇతర సభ్యులు, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నగరంలో టపాసులు కాలుస్తున్న బీజేపీ నాయకులు



## ఉమ్మడి జిల్లాలో బీజేపీ సంబురాలు

**అక్షరటుడే, ఇందూరు:** బీహార్‌లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నిజామాబాద్ నగరంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, నాయకులు పటాకులు కాల్చారు. అనంతరం స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ బీహార్ ప్రజలకు ఎన్డీయే కూటమికి అపూర్వ విజయాన్ని అందించారని చెప్పారు. అలాగే బోధన్, లింగంపేటలలో కూడా సంబరాలు నిర్వహించుకున్నారు.



బోధన్ పట్టణంలో..



లింగంపేట మండల కేంద్రంలో..

ఆరుగాలం కష్టించి పంట పండిస్తున్న అన్నదాతను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. పంట వేసినప్పటి నుంచి కోత వరకు ఒక ఎత్తయితే.. కోత కోసిన నుంచి పంట అమ్ముడు పోయి చేతికి డబ్బులు రావడం మరొక ఎత్తవుతోంది. కొనుగోలు కేంద్రం నుంచి రైస్ మిల్లుకు ధాన్యం వెళ్లే వరకు తరుగు పేరిట సంచుల కొద్దీ ధాన్యం నిలువు దోపిడీ చేస్తున్నారు. ఫలితంగా అన్నదాతలు వేలాది రూపాయలు నష్టపోతున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి



- తేమశాతం పేరుతో మిల్లర్ల మాయాజలం
- ఒక్కో లోడుకు 18-25 బస్తాలు కోత
- నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

# తరుగు దోపిడీ

వానాకాలం సీజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలతో పంటలు కొట్టుకుపోయాయి. తెగుళ్లు ఆశించి దిగుబడి తగ్గింది. పంట ఆరబోసిన సమయంలో వర్షాలు పడడంతో ధాన్యం కాపాడుకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇన్ని అవస్థలు పడి కాపాడిన పంటను అమ్మిన తర్వాత మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే తరుగు తీస్తున్నారు. 40 కిలోల బస్తాల్లో ప్రాంతాలను బట్టి 1.5 కిలోల నుంచి 2.3 కిలల వరకు అదనంగా తూకం వేస్తున్నారు. అయినా కూడా మళ్లీ మిల్లర్లు తేమశాతం పేరిట మెలిక పెడుతున్నారు.

### రైతుల ఆందోళన

రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తారు. కేంద్రాల నిర్వాహకులు తేమశాతం చెక్ చేసి ధాన్యం కాంటా చేస్తారు. 17శాతం లోపు ఉంటేనే ధాన్యం కొంటారు. లేదంటే ఆరబెట్టాలని రైతులకు సూచిస్తారు. అయితే నిర్ణీత తేమశాతం ఉన్న బస్తాలను కాంటా చేసి, లారీల్లో మిల్లులకు పంపిన తర్వాత వారు అక్కడ దోపిడీ చేస్తున్నారు. రైస్ మిల్లు వద్ద కూడా మాయిశ్చర్ తనిఖీ చేయగా కొనుగోలు కేంద్రానికి రైస్ మిల్లుకు మధ్య మాయిశ్చర్ వ్యత్యాసం వస్తోంది. దాంతో రైతులు తెచ్చిన ధాన్యం లోడు నుంచి బస్తాల కొద్దీ కోత పెడుతున్నారు. ఒక్కో లారీలో 600 నుంచి 800 బస్తాల వరకు ధాన్యం తరలిస్తారు. మిల్లర్లు తేమ శాతం లేదని చెబుతూ.. దాదాపుగా 20 బస్తాలకు పైగా కోత విధిస్తున్నారు.

### చర్యలు కరువు

కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లుకు చేరిన ధాన్యం లోడింగ్ వరకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. మిల్లర్ల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మిల్లర్ల దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలం అవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడింగ్ చేయడం వరకు మాత్రమే సెంటర్ ఇన్‌ఛార్జి బాధ్యత ఉండడంతో రైస్ మిల్లు వారికి చెప్పలేని పరిస్థితి నెలకొంది. తరుగు పేరిట కోత విధించడానికి అన్నదాతలు ఒప్పుకోకపోతే మిల్లర్లు ఆ లారీలోని బస్తాలను దింపుకోవడం లేదు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు మిల్లర్లు చెప్పిన దానికి అంగీకరిస్తున్నారు. అయితే ఈ విషయమై జిల్లా అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### 18 బస్తాలు కోత విధించారు



కొనుగోలు కేంద్రం నుంచి నాతో పాటు మరో ఇద్దరి ధాన్యం లోడ్ రైస్ మిల్లుకు పంపించాం. లారీలో నాకు సంబంధించిన 127 బస్తాలు ఉండగా.. రైస్‌మిల్లు వారు 7 బస్తాలు కోత విధించారు. మరొక ఇద్దరివి 11 బస్తాలు మొత్తం 18 బస్తాల ధాన్యం కోత విధించారు. రైస్ మిల్లులో చెక్ చేసిన మాయిశ్చర్ తక్కువ ఉందని, కోత విధిస్తేనే ధాన్యం అన్ లోడింగ్ చేస్తామని చెప్పారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కోతకు ఒప్పుకోవాల్సి వచ్చింది.

– గణేష్, శాబ్దిపూర్

### చూపించడం లేదు



మిల్లుకు వచ్చిన లారీలో ధాన్యంలో మళ్లీ తేమ శాతం చెక్ చేస్తున్నారు. రైతులు లేనప్పుడు చెక్ చేసి తేమ ఎక్కువ ఉందని కోత విధిస్తున్నారు. కోత విధించడానికి మేము ఒప్పుకోకున్నా ఒప్పుకున్నట్టుగా ట్రక్ షీట్ లో రాసి ధాన్యం అన్‌లోడ్ చేస్తున్నారు. దీంతో వేలకు వేలు నష్టపోవాల్సి వస్తుంది.

– బాణోత్ లక్ష్మణ్, రైతు, శాబ్దిపూర్ తండా

## 17న వాహనాల వేలం: ఎక్సైజ్ సీఐ

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 17న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ సంపత్ కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు ఫ్యాషన్ ప్రో బైకులు, మూడు హీరో స్ప్లెండర్ బైకులు ఒక ఆటో, ఒక బజాజ్ పల్సర్ బైకు, ఒక యమహా బైకు, ఒక వేగనార్ కారు, పల్సర్ 150 బైకు, హోండా యాక్టివా వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు నర్సన్నపల్లి వద్ద ఉన్న కార్యాలయంలో నిర్వహించనున్న వేలంలో 18 శాతం జీఎస్టీ సహా ఈనెల రూ.5వేల డిపాజిట్‌తో పాల్గొనాలని సూచించారు.



## సీఎంఆర్‌ఎఫ్ చెక్కును చించేసిన సీడీసీ ఛైర్మన్

**అక్షరటుడే, కామారెడ్డి :** ఎమ్మెల్యే పీఏల తీరుతో రాజీనామా చేసిన సదాశివనగర్ సీడీసీ ఛైర్మన్ ఇర్షాదొద్దీన్ మరోసారి వార్తల్లో నిలిచారు. తన సోదరికి సంబంధించిన సీఎం సహాయ నిధి చెక్కును చించివేసి తన ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. వివరాల్లోకి వెళ్తే.. ఇర్షాదుద్దీన్ చెల్లెలు నేహా బేగం 2024లో రోడ్డు ప్రమాదం జరగగా.. తలకు బలమైన గాయమై దీర్ఘకాలంగా చికిత్స పొందుతూ మృతి చెందింది. చికిత్సకు రూ.32 లక్షలు ఖర్చు కావడంతో సీడీసీ ఛైర్మన్ ఇర్షాదొద్దీన్ సీఎం ఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆ కుటుంబానికి కేవలం రూ.60 వేలు మాత్రమే రావడంతో ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.32 లక్షలకు దరఖాస్తు చేస్తే కేవలం రూ.60 వేలు రావడంతో ఆ చెక్కు తమకు అవసరం లేదని పేర్కొంటూ శుక్రవారం చెక్కును చించేసి తన ఆవేదనను వెళ్లగక్కారు. ఇలా ఛైర్మన్ స్థాయి వ్యక్తి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు చించేయడం ప్రస్తుతం కామారెడ్డి లో హాట్‌టాపిక్‌గా మారింది.



## భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**అక్షరటుడే, కోటగిరి:** భూభారతిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో అన్నారు. పోతంగల్ తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో 499 దరఖాస్తులు వచ్చాయని, అందులో 130 సాదాబైనామాలు దరఖాస్తులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించిందన్నారు. ఆయన వెంట నాయబ్ తహశీల్దార్ అజీజ్, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్ ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలి

**అక్షరటుడే, ఇందూరు :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వసతి గృహ నిర్మాణాల కోసం పూర్వ విద్యార్థి ప్రతాప్ రెడ్డి రూ. 1.06 కోట్ల విరాళం అందించగా.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ రూ. 2.86 కోట్ల నిధులను విరాళంగా అందజేసింది. ఈ నిధులతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బాలబాలికలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం వేర్వేరుగా నిర్మించారు. నూతన వసతి గృహాలకు వారు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత పదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాంకేతిక విద్యను బలోపేతం చేయాలనే కృతనిశ్చయంతో సీఎం రేవంత్ రెడ్డి అనేక చర్యలు చేపడుతున్నారన్నారు. ఆధునిక సాంకేతిక విద్యను అభివృద్ధి చేయడం ద్వారా యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో మెరుగైన సాంకేతిక విద్యను బోధిస్తూ విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈ మేరకు అవసరమైన అన్ని మౌలిక, వసతి సదుపాయాలను కల్పించేందుకు



తమవంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. నేటి సామాజిక అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక విద్యతో కూడిన కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 66 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రమేశ్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మరింత 'సహకారం'..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఖాతాదారులు, రైతులకు మరింత సహకారం అందించేందుకు కో-ఆపరేటివ్ బ్యాంకులు బాగా పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. పట్టణంలో నిర్మించిన జిల్లా కోఆపరేటివ్ సహకార బ్యాంక్ భవనాన్ని ఎమ్మెల్యే గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో లక్ష్మి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, ఆర్డీవో పార్థసింహారెడ్డి, బ్యాంకు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## ట్రాఫిక్ నియమాలపై విద్యార్థుల ప్రదర్శన భేష్

**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డు ప్రమాదాలకు కారణాలను వివరించేందుకు విద్యార్థుల నిర్వహించిన ప్రదర్శన భేష్ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిజాంసాగర్ చౌరస్తాలో కిడ్స్ విత్ ఖాకీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తా వద్ద పాఠశాలల విద్యార్థులు పలు ప్రదర్శనలు చేపట్టారు. డ్రంకన్ డ్రైవ్‌తో పాటు, హైస్పీడ్ వల్ల జరిగే ప్రమాదాలను కళ్లకు కట్టినట్టుగా చూపించారు. అలాగే ప్రమాదాల వల్ల చనిపోయే కుటుంబాల వ్యథ ఎలా ఉంటుంది. ఆ కుటుంబం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటుందనే వివరాలను తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పకడ్బందీగా పనిచేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు వాహనదారులకు అవగాహన కల్పించడం, తరచుగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండి మిగతా వారికి అవగాహన కల్పించేలా కృషి చేయాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి కలెక్టర్, ఎస్పీ నివాళులర్పించారు. కార్యక్రమంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐలు, ఎస్సైలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కొత్తపల్లిలో నాయక్‌పోడ్ భీమన్న ఉత్సవాలు ప్రారంభం

**అక్షరటుడే, ముప్కాల్:** ఆదివాసీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నాయక్ పోడ్ భీమన్న ఉత్సవాలు మండలంలోని కొత్తపల్లిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజలు, ఆదివాసీ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. దారిపొడవునా డప్పు చప్పుళ్ల మధ్య, నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో భీమన్న దేవునికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా.. శనివారం భీమన్న గజ్జలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించనున్నారు. ఆదివారం ఉత్సవాల చివరి రోజు భీమన్న గజ్జల కల్యాణ మహోత్సవం, అలాగే అగ్గి గుండం ఏర్పాటు చేసి సంప్రదాయ రీతిలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు గ్రామ ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న భీమన్న ఉత్సవాల నేపథ్యంలో కొత్తపల్లి గ్రామంలో సందడి నెలకొంది.




## 16న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 'వాక్ ఫర్ జస్టిస్'

**అక్షరటుడే, ఇందూరు:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈనెల 16న రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు 'వాక్ ఫర్ జస్టిస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. ఈమేరకు నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ 'అష్టాదశ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా బీసీ జేఏసీ రాష్ట్ర కో–చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో ఆదివారం వాక్ ఫర్ జస్టిస్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఉదయం ఏడు గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీలందరూ పెద్దఎత్తున పాల్గొని రిజర్వేషన్ల కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈ 'వాక్ ఫర్ జస్టిస్' కార్యక్రమంలో బీసీలతో పాటు బహుజనలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, బగ్గలి అజయ్ చంద్రకాంత్, ఆర్టీసీ నర్సయ్య, బాలన్న, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





నగరంలోని ఇంద్రాణి స్కూల్‌లో..



ముప్కాల్ మండలంలో..

## ఉత్సాహంగా బాలల దినోత్సవం..

బాలల దినోత్సవాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠశాలల్లో సందడి చేశారు. వివిధ రకాల వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్







స్మైల్స్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు..



నగరంలోని ఓయాసిస్ స్కూల్..



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో..




పెద్దకొడప్ గల్ మండల కేంద్రంలో..



బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



ఆలూర్ మండల కేంద్రంలో..



ఆలూర్ పాఠశాల లో బాలల దినోత్సవ వేడుకలు..



ఆర్మూర్ విజయ్ హైస్కూల్‌లో..



ఎల్లారెడ్డి మండల కేంద్రంలో..



ధర్పల్లి మండల కేంద్రంలో..




ఆర్మూర్ పట్టణ శివారులోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో..



## రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి మగ్గిడి పూర్వవిద్యార్థులు

**అక్షరటుడే, ఆర్మూర్:** మేడ్చల్ జిల్లాలో ఈనెల 14 నుండి 16 వరకు జరుగనున్న సీనియర్ మహిళల, పురుషుల వాలీబాల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో ఆర్మూర్ మండలం మగ్గిడి పాఠశాల పూర్వ విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ మధుసూదన్ తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థులు అమూల్య (జీజీ కాలేజీ) సంజన (జీజీ కాలేజీ), హిమతేజ (ప్రభుత్వ కళాశాల, ఆర్మూర్) ఎంపికైనట్లు వారు తెలిపారు. వీరి ఎంపిక పట్ల తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, మగ్గిడి పాఠశాల హెచ్‌ఎం ధర్మగడ్డ హరిత, మాజీ సర్పంచ్ సుమలత నర్సయ్య, వీడీసీ సభ్యులు, రాష్ట్ర ఉత్తమ రైతు నలిమేల చిన్నారెడ్డి, ప్రజలు అభినందనలు తెలిపారు.




## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ క్యాంప్

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చౌట్‌పల్లి ప్రాథమిక కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ చిలివేరి పవన్ కుమార్ ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లుక్క గంగాధర్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజలను పట్టిపీడిస్తున్న డయాబెటిస్ వ్యాధిని అరికట్టాలంటే అందరూ మానసికోల్లాసంఓ ఉండాలన్నారు. అలాగే ప్రతిఒక్కరూ మూణ్నెళ్లకొకసారి షుగర్ టెస్ట్ చేసుకోవాలని సూచించారు. 130 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి కార్యక్రమంలో కార్యదర్శి రేవతి నలిమెల గంగాధర్, కోశాధికారి తెడ్డు రమేష్, చింత ప్రదీప్, సుంకరి విజయ్ కుమార్, జగన్ రాహుల్ గణేష్, ప్రజలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం ప్రారంభం



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని భీముని గుట్టపై ఉన్న ఏకచక్రేశ్వరాయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు నిత్యాన్నదానం ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నదానం ప్రారంభించారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది సైతం స్వాములకు నిత్యాన్నదానం ఏర్పాటు చేసిన ఏకచక్రేశ్వరాలయం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో బోధన్ తహశీల్దార్ విఠల్, కమిటీ సభ్యులు సాంబశివరాం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**అక్షరటుడే, ఆర్మూర్:** గృహ నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్ కొట్టి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆర్మూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కుమార లహరి (35) పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో తన చేతిలోని అల్యూమినియం పట్టి బిల్డింగ్‌పై ఉన్న వైర్లకు తాకింది. దీంతో కరెంట్ షాక్ కొట్టి కుప్పకూలాడు. వెంటనే స్థానికులు అతడిని ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ/ధర్పల్లి/బోధన్:** మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి నిజామాబాద్ న్యాయస్థానం జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మార్నింగ్ కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. ఇందులో నలుగురికి రూ. 45,000 జరిమానా విధించారు. అలాగే ముగ్గురికి వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ధర్పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా.. సిరికొండ మండలం రావుట్ల గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ మద్యం సేవించి బైక్ నడుపుతూ పోలీసులకు చిక్కాడు. దీంతో పోలీసులు అతడికి కౌన్సెలింగ్ నిర్వహించి శుక్రవారం నిజామాబాద్‌లో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి అతడికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే బోధన్ పట్టణంలో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి పోలీసులకు చిక్కారు. వారిని బోధన్ కోర్టులో ప్రవేశపెట్టగా పోశెట్టి అనే వ్యక్తికి మూడురోజుల జైలు, లక్ష్మీనారాయణకు వారంరోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.




## ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్ష శిబిరం

**అక్షరటుడే, భీమ్‌గల్:** లయన్స్ క్లబ్ భీమ్‌గల్, వేముగల్లు ఆధ్వర్యంలో మండలంలోని బడా భీమ్‌గల్‌లో ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పడాల పురంధర్ మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా గ్రామస్థులు ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ హన్మాండ్లు, కార్యదర్శి గజ్జల చైతన్య, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ రామావత్ శ్రీకాంత్, పీఆర్‌వో లింబాద్రి, వీడీసీ అధ్యక్షుడు మోర్తాడ్ లింబాద్రి, నాయకులు పిట్ల శ్రీనివాస్, రాగుల మోహన్, రాగుల లింబాద్రి, గన్నారం సురేష్, మాంద్ర సుమన్, పెట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



### డయాబెటిక్‌పై అవగాహన

**ఆర్మూర్:** పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డయబెటిక్ డే సందర్భంగా శుక్రవారం పేషెంట్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ కృష్ణ, హాస్పిటల్ యాజమాన్యం ప్రతాప్, సుమన్, ప్రమోద్, మల్లయ్య, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖలో టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

**అక్షరటుడే, కామారెడ్డి:** టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా చేపడుతోంది. వివిధ శాఖల ఉద్యోగుల నుంచి సభ్యత్వ నమోదు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎక్సైజ్ శాఖలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ.. 80 ఏళ్ల చరిత్ర కలిగి.. ఉద్యోగుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న టీఎన్జీవోస్ సంఘంలో సభ్యత్వం తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు చక్రధర్, శివకుమార్, ఈసీ కేంద్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, పోచయ్య, రాజేశ్వర్, పబ్లిసిటీ సెక్రెటరీ రాజ్ కుమార్, కొండల్ రెడ్డి, ఎంఎస్ రావు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.




## టీఆర్‌పీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

**అక్షరటుడే, కామారెడ్డి :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను నియమించారు. ఈ మేరకు గురువారం రాత్రి పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మహమ్మద్ తాహెర్ బిన్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొక్కల సంతోషిని నియమించారు. జిల్లాలో పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన పార్టీ అధ్యక్షుడు మల్లన్నకు, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిశంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఓదెలు, ప్రధాన కార్యదర్శి జానయ్య, సూర్యారావు, జిల్లా ఇన్‌ఛార్జి హన్మాండ్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని సంస్థాగతంగా నిర్మించేందుకు అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీని బలోపేతం చేస్తామన్నారు.



